క్లుప్తంగా

కోర్టు పనుల పరిశీలన

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో త్వరలో ప్రారంభించనున్న జూనియర్ సివిల్ కోర్టుకు సంబంధించిన పనులను స్థానిక న్యాయవాదులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టు పనులు దాదాపు పూర్తి అయ్యాయని, డిసెంబర్ మొదటి వారంలో కోర్టును అధికారికంగా ప్రారంభిస్తారన్నారు. అతిత్వరలో డివిజన్ ప్రజలకు ఘన్‌పూర్‌లోనే కోర్టు సేవలు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. న్యాయవాదులు గట్టు మనోహర్‌గౌడ్, నీరటి కార్తీక్, అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం

స్టేషన్‌ఘన్‌పూర్: శివకేశవులకు అత్యంత ప్రీతికరమైన కార్తీకమాస సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని శివునిపల్లికి చెందిన వ్యాపారి, భక్తుడు పార్శి రంగారావు, స్వప్న దంపతులు, వారి కుమార్తె శివాని ఆధ్వర్యంలో ఘనంగా శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. శివునిపల్లిలో జయగార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో చేపట్టిన కార్యక్రమంలో అర్చకుల మంత్రోచ్చరణల మధ్య ఆదిదంపతులైన పార్వతీ పరమేశ్వరుడి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. నర్సింహులు, వెంకట్రామనర్సయ్య, రాజేశ్వరరావు, శ్రీనివాస్, బుచ్చిబాబు, ప్రభాకర్, వెంకన్న పాల్గొన్నారు.

సిద్దేశ్వరాలయంలో పూజలు

బచ్చన్నపేట: కొడవటూర్ గ్రామంలోని స్వయంభూ సిద్దేశ్వరాలయంలో కార్తీక మాస మూడో సోమవారం పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సామూహిక సత్యనారాయణ వ్రతాలు, అభిషేకాలు, అన్నపూజ కార్యక్రమాలను చేపట్టారు. అలాగే ఆలయం ఎదుట కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయ ప్రధాన పూజారి ఓం నమశివాయ, ఈఓ చిందం వంశీ, సిబ్బంది నూకల లక్ష్మీకాంత్‌రెడ్డి, బండారి శ్రీనివాస్, గంగం భానుప్రకాష్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ధర్మ యుద్ధానికి సిద్ధంగా ఉండాలి

పాలకుర్తి: ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయకుంటే మదిగ కులస్తులంతా ధర్మ యుద్ధానికి సిద్ధంగా ఉండాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రాగల్ల ఉపేందర్ పిలుపునిచ్చారు. సోమవారం పాలకుర్తి గౌడ సంఘం కార్యాలయంలో రాష్ట్ర నాయకుడు చెరిపెల్లి యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పును అమలు చేయకపోవడం దారుమన్నారు. రాజశేఖర్, రవీందర్, సుధాకర్, నరేష్, రాంచంద్రు, నాగరాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులను నియంత్రించాలి

జఫర్‌గఢ్: జిల్లా వ్యాప్తంగా విచ్చలవిడిగా వెలసిన బెల్టు షాపులను ఎక్సైజ్ శాఖ అధికారులు నియంత్రించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం కాట సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బెల్టు షాపులను నియంత్రించడంలో ఎక్సైజ్ శాఖ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఈ మేరకు ఈ నెల 21న జిల్లా ఎక్సైజ్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు, ఆర్ సోమయ్య, మండల కార్యదర్శి రాజు, సుధాకర్, రజిత, సమ్మయ్య, గంగరాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలపత్రాలు వైద్య విధాన పరిషత్‌కు అందజేత

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణం కోసం స్థానికంగా ఉన్న ఆర్టీసీ సంస్థకు చెందిన నాలుగు ఎకరాల స్థలానికి చెందిన పత్రాలను ఆర్డీఓ డీఎస్ వెంకన్న సమక్షంలో సోమవారం వైద్య విధాన పరిషత్ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడారు. ఘన్‌పూర్‌లో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి కోసం ఆర్టీసీకి చెందిన నాలుగు ఎకరాల స్థలాన్ని వైద్య విధాన పరిషత్‌కు అందించాలని ప్రభుత్వం జీఓ జారీ చేసిందని, ఈ మేరకు సదరు స్థలానికి చెందిన పత్రాలను పరిశీలించి కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్టీసీ అధికారులచే వైద్య విధాన పరిషత్ వారికి అందించినట్లు తెలిపారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ వీరాంజనేయులు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లిఖార్జున్‌రావు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఘన్‌పూర్ సీహెచ్‌సీ సూపరిండెంట్ డాక్టర్ సంధ్య, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

సన్మానం



లింగాలఘణపురం: జీడికల్ వీరాచల రామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం రాత్రి నల్గొండ జిల్లా ఆత్మకూరు మండలానికి చెందిన సుడి పద్మను మాజీ జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి శాలువాతో సన్మానం చేశారు. రెండేళ్లుగా భక్తులకు ప్రతి శనివారం అన్నదానం చేస్తున్న భక్తురాలు పద్మ వీరాచల రామచంద్రస్వామి అనుగ్రహంతో ఆలయ దర్శనానికి వచ్చే భక్తులకు అన్నదానం చేయడం అభినందనీయమని కొనియాడారు.

'జీడికల్' జిగేల్



విద్యుత్ వెలుగుల్లో ఆలయం

- రేపు వీరాచల రామచంద్రస్వామి కల్యాణోత్సవం
- ఆలయం ముస్తాబు



గర్భగుడిలోని మూలవిరాట్, ఉత్సవ విగ్రహాలు

లింగాలఘణపురం: రెండో భద్రాద్రిగా పేరు గాంచిన జీడికల్ శ్రీ వీరాచల రామచంద్రస్వామి ఆలయంలో కార్తీక మాసంలో జరిగే జాతర ఎంతో ప్రాశస్త్యం కలిగింది. ఈ నెల 20వ తేదీన స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు ఆలయాన్ని విద్యుత్ వెలుగులతో ముస్తాబు చేశారు. పునర్వసు నక్షత్రంలో రామచంద్రుడి కల్యాణోత్సవం నిర్వహించడం ఇక్కడి విశేషం. పూర్వ కాలంలో నెల రోజుల పాటు పున్నమి జాతర జరిగేది.. నల్గొండ జిల్లా పరిధిలో ఉన్న సమయంలో కలెక్టర్ నెల రోజుల పాటు ఇక్కడే బస చేసి ఏర్పాట్లు పర్యవేక్షించేది.. ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న కలెక్టర్ భవనం ఇందుకు నిదర్శనంగా కనిపిస్తుంది. భక్తుల పాలిట కొంగుబంగారంగా స్వామివారు విలసిల్లుతున్నారు. జీడికల్‌లో సుమారు 80 శాతం ప్రజల పేర్లు రాములు, లక్ష్మయ్య, ఆంజనేయులు, జానకి అనే పేర్లతోనే ఉండడం భక్తుల విశ్వాసానికి నిదర్శనం.

లేడి బండ.. జీడిగుండం.. పాలగుండం

శ్రీరామచంద్రమూర్తి మాయలేడిని ఇక్కడే సంహకరించాడని, ఇందుకు ఆలయానికి రెండు కిలోమీటర్ల దూరంలోని లేడి బండ నిదర్శనంగా నిలుస్తుంది. అలాగే జీడిగుండం, పాలగుండంలో స్నానాలు చేస్తే పాప విమోచనం జరుగుతుందని భక్తుల నమ్మకం. భద్రుడి తపస్సుతో భద్రాచలంలో వెలసిన శ్రీరాముడు.. వీరుడి తపస్సుకు మెచ్చి జీడికల్‌లో వీరాచల రామచంద్రుడిగా స్వయంభువుగా వెలసినట్లు ప్రతీతి.

ఎమ్మెల్యే చొరవతో భారీ ఏర్పాట్లు

గతంలో ఎన్నడూ లేని విధంగా వీరాచల రామచంద్రస్వామి కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవతో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు రూ.50 లక్షల వ్యయంతో రోడ్లు, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్య పనులు చేపట్టి భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకున్నారు. సెంట్రల్ లైటింగ్ సిస్టమ్, ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్లు, మినీ ట్యాంకులు ఏర్పాటు చేశారు. ఈనెల 2న కలెక్టర్ సమక్షంలో సమీక్ష, 16న క్షేత్రస్థాయి పర్యటనతో ఏర్పాట్లను పరిశీలించారు.

విజయోత్సవ సభకు 99 బస్సులు

- కలెక్టర్ ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ
- పెద్ద ఎత్తున తరలనున్న కాంగ్రెస్ శ్రేణులు



ఆర్టీసీ బస్సులు

జనగామ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సంక్షేమ పథకాల అమలుపై పెద్ద ఎత్తున సంబురాలు జరుపుకునేందుకు ప్రభుత్వం పిలుపునిచ్చింది. ఈ మేరకు హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో నేడు(మంగళవారం) నిర్వహించే ప్రజాపాలన విజయోత్సవ సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎలా అమలు చేస్తున్నారనే దానిపై సభలో మరోసారి వెల్లడించనున్నారు. ఈ మేరకు జిల్లా నుంచి వేలాది మంది మహిళలను తరలించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. మరో వైపు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యశస్వినిరెడ్డి, కడియం శ్రీహరి ఆధ్వర్యాన జనగామ, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ నియోజక వర్గాల నుంచి పార్టీ శ్రేణులు తరలి వెళ్లనున్నారు. ఇందుకోసం జిల్లా నుంచి 99 ఆర్టీసీ బస్సుల్లో 4,445 మంది మహిళలను తరలించనున్నారు. కలెక్టర్ నేతృత్వంలో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, డీసీపీ, డీఆర్డీఓ వసంత, జెడ్పీ సీఈఓ, మెప్మా పీడీ హర్షవర్ధన్, డీపీఓ, డీఎంహెచ్ఓ, ఆర్టీసీ డిపో మేనేజర్ పర్యవేక్షణలో ఒక్కో బస్సులో లైజన్ ఆఫీసర్లు 1, 2, పోలీసు కానిస్టేబుల్, ఆశ కార్యకర్త ఉంటారు.

'ఘన్‌పూర్' అభివృద్ధికి రూ.400 కోట్లు

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.400 కోట్ల నిధులు మంజూరు చేస్తూ జీఓలు జారీ చేసిందని స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఘన్‌పూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గానికి మంజూరైన పనులు, నిధులు తదితర వివరాలను వెల్లడించారు. నియోజకవర్గానికి మంజూరైన పనులు, నిధులు తదితర వివరాలను వెల్లడించారు. ఎన్నికల ముందు ప్రజలకు చేసిన హామీల మేరకు నియోజవకర్గ అభివృదుంధ ప్రధాన ఎజెండాగా కాంగ్రెస్ పార్టీలో చేరానని, అప్పటి నుంచి సీఎం రేవంత్‌రెడ్డిని, వివిధ శాఖల మంత్రులను పలుమార్లు కలుస్తూ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి మన విన్నపాలను గుర్తించి స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంపై వరాలజల్లు కురిపించారన్నారు. దాదాపు రూ. 400 కోట్ల మంజూరైన పనులకు డిసెంబర్ మొదటి వారంలో టెండర్లు పిలిచి నెలాఖరులో స్వయంగా సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేయిస్తామన్నారు.

ఐదు ప్రధాన పనులకు జీఓలు జారీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్‌స్కూల్ కాంప్లెక్స్ స్టేషన్‌ఘన్‌పూర్‌కు మంజూరైందని, రూ.150 కోట్ల నుంచి రూ.200 కోట్లతో ఈ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం గతంలో ఆర్టీసీ వారికి అందించిన నాలుగు ఎకరాల స్థలాన్ని వైద్య విధాన పరిషత్‌కు కేటాయిస్తూ జీఓ జారీ చేసిందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఘన్‌పూర్‌కు మంజూరు చేశారన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట ఉండేలా రూ.26 కోట్ల నిధులతో రెవెన్యూ డివిజనల్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణానికి జీఓ వచ్చిందన్నారు. ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి నవాబుపేట వరకు కుడి ప్రధాన కాల్వ లైనింగ్ పనులకు రూ.150 కోట్లు మంజూరు చేశారని, ఘన్‌పూర్ శివారు ఇందిరానగర్ నుంచి కొత్తపల్లి మీదుగా మల్లన్నగండి వరకు రూ.15 కోట్లతో డబుల్‌రోడ్డు మంజూరైందన్నారు.

నేటి సభను జయప్రదం చేయాలి

హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నేడు నిర్వహించనున్న సీఎం రేవంత్ రెడ్డి సభకు నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు, రైతులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఏఎంసీ చైర్‌పర్సన్ లావణ్యశిరీష్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఐలయ్య, పార్టీ రాష్ట్ర నాయకులు సీహెచ్.నరేందర్‌రెడ్డి, వెంకన్న, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాంబాబు, శ్రీధర్‌రావు, జగదీష్‌చందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయుని దీవెనలు గ్రామానికి ఉండాలి

చిల్పూరు: భక్త మార్కండేయుని దీవెనలు గ్రామానికి ఉండాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని చిన్నపెండ్యాల గ్రామంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన అర్చకులు యల్లంభట్ల కరుణాకరశర్మ వేద మంత్రాల నడుమ నిర్వమించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కడియం హాజరై మాట్లాడారు. ఆలయ ప్రహరీ నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరు చేస్తానని తెలిపారు. చిల్పూరు ఆలయ మాజీ చైర్మన్ శ్రీధర్‌రావు, పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు దామోదర్, రాజన్‌బాబు, లింగారెడ్డి, సమ్మయ్య, రంజిత్‌రెడ్డి, సంపత్, వేముల వెంకటేశ్వర్లు ఉన్నారు.

కాంగ్రెస్ పాలన ఆదర్శం

- ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రజాపాలన ప్రారంభమై ఏడాది గడిచిన సందర్భంగా ఈనెల 19న మంగళవారం వరంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే ప్రజా విజయోత్సవ సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాపాలన విజయవత్సవ పర్యవేక్షకులు రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ఎం.రామిరెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి మాట్లాడారు. ఏడాది కాంగ్రెస్‌ప్రభుత్వ పాలనలో హామీలను అమలు చేసిన ఘనత సీఎం రేంవత్‌రెడ్డి దక్కిందన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండలాల అధ్యక్షులు కుమారస్వామి, సురేష్‌నాయక్, నల్ల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలి

రఘునాథపల్లి: హనుమకొండ ఆర్ట్స్ కళాశాల మైదానంలో మంగళవారం జరిగే సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభను విజయవంతం చేయాలని గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ అధ్యక్షతన జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. బుచ్చయ్య, మార్కెట్ డైరెక్టర్లు రమేష్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్ల: హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల మైదానంలో మంగళవారం జరిగే ప్రజాపాలన విజయోత్సవ సభను విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ కోరారు. సోమవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ సభకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నందున మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

ఇందిరా మహిళా శక్తి విజయోత్సవాలను జయప్రదం చేయాలి

పాలకుర్తి టౌన్: తెలంగాణ ప్రభుత్వం నేడు వరంగల్‌లో నిర్వహించే ఇందిరా మహిళా శక్తి విజయోత్సవాలను జయప్రదం చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ రాములు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ భవన్‌లో ఏపీఎం పిట్టల నరేందర్ ఆధ్వర్యంలో మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఏపీఓ రవీందర్, జిల్లా సమైక్య అధ్యక్షురాలు గిరగాని సుధ, సీసీలు వెంకటేశ్వర్లు, అనురాధ, శోభ, వెంకన్న,యాదగిరి, గ్రామైక్య సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

సర్వేను పారదర్శకంగా నిర్వహించండి



నర్మెట: సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

నర్మెట: సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను ఎన్యుమరేటర్లు పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. మండలకేంద్రంలో నిర్వహిస్తున్న సర్వే సరళిని పరిశీలించిన ఆయన పూరించిన సర్వే ఫాంలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసి సీఈఓ కొన్నె వెంకటయ్యను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీపీఆర్‌ఓ శ్రీనివాస్ రావు, తహసీల్దార్ కె. రామనుజా చార్యులు, ఎంపీడీఓ బి.అరవింద్ చౌదరి, ఎమ్మార్మై సింగారం సాయిబాబు, సూపర్ వైజర్ పాతూరి ఆంజనేయులు, ఎన్యుమరేటర్ సీహెచ్ కావ్య పాల్గొన్నారు.

సర్వేను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

బచ్చన్నపేట: సర్వే ప్రక్రియను ఎన్యూరేటర్లు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి నాగపురి స్వరూపారాణి అన్నారు. మండలంలోని కొడవటూర్ స్వయంభూ సిద్దేశ్వరాలయంలో ఆమె పూజలు చేసిన అనంతరం మండల కేంద్రంలో చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వే తీరును పరిశీలించారు. ఎంపీడీఓ మల్లికార్జున్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేను వేగవంతంగా చేపట్టాలి

స్టేషన్‌ఘన్‌పూర్: సమగ్ర కుటుంబ సర్వేను ఎన్యుమరేటర్లు వేగవంతంగా చేపట్టాలని సర్వే సూపర్‌వైజర్ గీరెడ్డి ప్రమోద్‌రెడ్డి అన్నారు. తాటికొండలో జరుగుతున్న సర్వేను ఆయన సోమవారం పరిశీలించి ఎన్యూమరేటర్లకు సలహాలు, సూచనలు అందించారు. మాజీ జెడ్పీటీసీ మారపాక రవి, ఎన్యుమరేటర్ రవి పాల్గొన్నారు.

సైన్స్ టీచర్లకు ఓరియంటేషన్ తరగతులు



జనగామ: పట్టణంలోని సెయింట్ మేరీస్ స్కూల్‌లో సోమవారం మండలంలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న సైన్స్, మ్యాథ్స్ టీచర్లకు మండల విద్యాధికారి వంగాల రాజేందర్ ఆధ్వర్యంలో ఓరియంటేషన్ తరగతులను నిర్వహించారు. సబ్జెక్టు ఆర్‌పీలు సత్తెయ్య, ఉమాదేవి, రవీందర్ సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులతో ఎగ్జిబిట్లను ఎలా తయారు చేయించాలో అవగాహన కలిగించారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు చలపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయులతో పాటు వివిధ పాఠశాలల నుంచి సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధి పొందాలి



మాట్లాడుతున్న డీపీఎం వినతరెడ్డి

బచ్చన్నపేట: మహిళలు జీవనోపాధి కోసం స్వయం ఉపాధిని పొందడానికి కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవాలని, అందుకు బ్యాంకుల ద్వారా రుణాలు పొందవచ్చని ఐకేపీ డీపీఎం వినతరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రచన మండల సమాఖ్య కార్యాలయంలో మండల సమైఖ్య అధ్యక్షురాలు విజయశాంతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు సంఘంలో సభ్యురాలుగా ఉన్నప్పుడే అన్నివిధాల లబ్ధి పొందుతారని తెలిపారు. ఎంపీడీఓ మల్లికార్జున్, ఏపీఎం నాగేశ్వర్‌రావు, సీసీలు సందుల నర్సింహులు, విజయలక్ష్మి, సత్యనారాయణ, తిరుమల, ఎంఎస్‌ఏ రవి, ఆపరేటర్ నవీన్, వీఓ అధ్యక్షులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నర్మెట: మచ్చుపహాడ్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మామిడాల వెంకటనర్సయ్య సతీమని అంజమ్మ (60) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. కాగా, విషయం తెలుసుకున్న పార్టీ ఉమ్మడి మండలాల కన్వీనర్ పెద్దిరాజిరెడ్డి పార్టీ శ్రేణులతో వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 10 వేల సాయం అందజేశారు. చింతకింది సురేష్, తేజావత్ గోవర్ధన్, ఎండీ గౌస్, రామిని శివరాజు, కంతి రాజలింగం, కొంపెల్లి రాజు, నాయకులు తదితరులు ఉన్నారు.

ఆలయానికి కల్యాణ మండపం అప్పగింత



కల్యాణ మండపం వద్ద ఈఓతో దాతలు

చిల్పూరు: చిల్పూరుగుట్ట అంగడి స్థలంలో దాతలు విరాళాలు అందించి నిర్మించిన కల్యాణ మండపాన్ని ఈఓ భాగం లక్ష్మీప్రసన్న సమక్షంలో దేవస్థానానికి అప్పగించారు. కార్తీక సోమవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా స్వామివారికి కల్యాణం చేసేందుకు శాశ్వతంగా రాతితో దాతలు నిర్మించిన మండపాన్ని అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దాతలను ఆలయ ప్రాంగణంలో ఘనంగా సన్మానించారు.

గిరిజనులపై కేసులు ఎత్తివేయాలి



రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పాలకుర్తి టౌన్: కొడంగల్ నియోజకవర్గం లగచర్ల గిరిజన రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, జరుపుల బాలునాయక్, మాజీ జడ్పీటీసీ ఫ్లోర్ లీడర్ పుస్కూరి శ్రీనివాస్‌రావు మాజీ జీసీసీ చైర్మన్ ధారవత్ గాంధీనాయక్‌తో కలిసి మాట్లాడుతూ ఫార్మా కంపెనీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేద గిరిజనుల భూములను తీసుకునేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఓయూ జేఏసీ వైస్‌చైర్మన్ రాజేష్‌నాయక్, జ్యోతి, ఎల్లయ్య, రమేష్,నాగరాజు, వెంకట్, గణేష్, వెంకన్న పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలను వినియోగించుకోవాలి



జఫర్‌గఢ్: లయన్స్ క్లబ్ సేవలను విద్యార్థులు వినియోగించుకోవాలని లయన్స్ క్లబ్ శివునిపల్లి అధ్యక్షుడు మహ్మద్ దస్తగిరి కోరారు. మండలంలోని తిమ్మంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు శానిటరీ న్యాప్కిన్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శారోన్, ఉపాధ్యాయులు మాధవీలత, కృష్ణమోహన్, హరిత, ఉదయశ్రీ, వాణి, సరోజ, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పేదలను ఆదుకోవడమే ధ్యేయం

జఫర్‌గఢ్: పేదలను ఆదుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. గోప్రాజుపల్లికి చెందిన సొడబోయిన రాజు కుమారుడు అజయ్‌కుమార్ ప్రమాదవశాత్తు కిందపడి కాలువిరిగి అస్పత్రిలో చేరాడు. ఇన్‌ఫెక్షన్ రావడంతో కాలు తీసేశారు. అయితే కృత్రిక కాలు ఏర్పాటుకు కిరణ్‌కుమార్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.లక్ష 50 వేలు మంజూరు చేయించారు. అజయ్‌కుమార్‌కు కృత్రిమ కాలు అందించేందుకు కృషి చేసిన కిరణ్‌కుమార్‌కు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జయప్రదం చేయండి



పాలకుర్తి: ముదిరాజ్ మహాసభ దశాబ్ది ఉత్సవాలు, 21న ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని మహాసభ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిక్కుడు రాములు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో రాజీవ్ చౌరస్తాలో ఉత్సవాల వాల్ పోస్టర్‌ను ముదిరాజ్ మహాసభ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాచర్ల ఎల్లయ్య, నీరటి చంద్రయ్య, మామిండ్ల లక్ష్మయ్య, దాసరి మధు, నీరటి సోమయ్య, మహంకాళి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు

జనగామ: చేనేత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలను ఇప్పించేందుకు నేత కార్మికుల నుంచి పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడగా, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా తనపై సదరు వ్యక్తి దాడి చేస్తే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ చేనేత విభాగం ఉపాధ్యక్షుడు కూరపా టి.శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల14వ తేదీన తనను అవమాన పరిచే విధంగా మాట్లాడి దాడి చేసి, హత్య చేసేందుకు ప్రయత్నం చేశారన్నారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, నేటికీ ఎఫ్ఐఆర్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాడి ఘటనకు సంబంధించి విచారణ జరిపి, సదరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు.

గిరిజన నాయకుల ముందస్తు అరెస్ట్

స్టేషన్‌ఘన్‌పూర్: కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో రోటిబండ తండా, పులిచెర్లకుంట తండాలలో గిరిజనుల వ్యవసాయ భూముల విషయమై రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం చేపట్టిన చలో గాంధీభవన్‌కు వెళ్లకుండా గిరిజన నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు మాట్లాడుతూ అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజ్మీరా స్వామినాయక్, సేవాలాల్‌సేన జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, కనకరాజు, కొమురెల్లి, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

లైసెన్స్ లేకుండా ఫర్టిలైజర్ దుకాణం

- వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యం



లైసెన్స్ లేకుండా అమ్ముతున్న ఫర్టిలైజర్ షాపు

తరిగొప్పుల: మండలంలోని బొంతగట్టునాగారం గ్రామంలోని శివమాన్విత్ ఫర్టిలైజర్ షాపు లైసెన్స్ కాలపరిమి పూర్తయినా.. అమ్మకాలు చేస్తుంటే వ్యవసాయ శాఖ చూసి చూడనట్లు వ్యవహరిస్తోంది. తనిఖీల సమయంలో స్టాక్ రిజిస్టర్‌లో చిన్న తప్పుకే హడావిడి చేసే అధికారులు ఏకంగా ఫర్టిలైజర్, పెస్టిసైడ్ షాపు లైసెన్స్ లేకుండా అమ్మకాలు చేస్తుంటే కళ్లుమూసుకుంటున్నారు. అడపాదడపా తనిఖీలు చేస్తున్నా.. లైసెన్స్ గడువు ముగిసిన సంగతి గుర్తించక పోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. జిల్లాలో ఎరువుల దుకాణాల నిర్వహణలో వ్యవసాయ శాఖ నిఘా కరువైంది. ఫర్టిలైజర్ దుకాణం నిర్వహణకు సదరు యజమానికి డిగ్రీ, బీఎస్సీ అగ్రికల్చర్ రసాయన శాస్త్రం అర్హతతో డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ టూర్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ ఆఫ్ ఇన్‌పుట్ (డీఏఈఎస్ఐ) శిక్షణ సర్టిఫికేట్ ఉండాలి. బొంతగట్టు నాగారంలోని శివ మన్విత్ ఫర్టిలైజర్ షాపు నిర్వాహకుడికి ఎలాంటి సర్టిఫికెట్లు లేకపోయినా, సుమారు ఐదు నెలలుగా ఫర్టిలైజర్ దుకాణం యథేచ్ఛగా నడిపిస్తున్నా వ్యవసాయ శాఖ అధికారుల చర్యలు కనిపించడం లేదు. షాపు నిర్వాహకుడి వెనుక ఉండి నడిపించిన అధికారి ఎవరనే దానిపై పలువురు చర్చించుకుంటున్నారు.

నిర్వాహకుడిపై చర్యలు తీసుకుంటాం

ఫర్టిలైజర్ దుకాణం నడిపించాలంటే నిబంధనలు తప్పనిసరి. ఎరువులు, పెస్టిసైడ్స్ అమ్మకాలకు లైసెన్స్ ఉంటేనే అమ్మకాలు చేయాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు కఠినంగా ఉంటాయి. శివమాన్విత్ ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేసి, లైసెన్స్ లేనట్టు గుర్తిస్తే చర్యలు తీసుకుంటాం.

– రామారావు, జిల్లా వ్యవసాయాధికారి